క్లుప్తంగా

ఘనంగా ఈస్టర్ ఉత్సవాలు

కాజీపేట: ప్రజల పాప పరిహారార్థం జేరుసాలెం రాజా భటుల ద్వారా శిక్షలు అనుభవించి అసువులు బాసిన ఏసుప్రభువు మూడు రోజుల అనంతరం పునరుత్థానుడైన రోజుకు గుర్తుగా కాజీపేట పట్టణంలో ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఆదివారం కనులపండువగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే కొత్త బట్టలు ధరించి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సెయింట్ జోసఫ్ చర్చిలో ఫాదర్ బల్తా రెడ్డి, తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ పి.విక్టర్ బాబురాజ్, అల్ఫా ఓ మెగా చర్చిలో బిషప్ జాన్ మార్కండేయ, సీఎస్ఐ జోహర్ పాల్, రివైవల్ చర్చిలో బ్రదర్ కురియన్, అయ్యల దానం తదితరుల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులు ధర్మసాగర్‌లోని కల్వరి కొండజాతరకు బయలుదేరి వెళ్లారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గం 28వ డివిజన్‌లో బల్దియా సాధారణ నిధులు రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు మేయర్ గుండు సుధారాణితో కలిసి అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బొందివాగు పూడికతీతతో పాటు చర్చి పక్క నుంచి దారి ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ గందె కల్పన కోరారు. కార్యక్రమంలో నాయకులు పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, గోపాల నవీన్‌రాజ్, మడిపల్లి కృష్ణ, డివిజన్ పార్టీ అధ్యక్షులు కురమిళ్ల సంపత్, శంకర్‌సింగ్, జలందర్, నరసింహారెడ్డి, కనకాచారి, శ్రీనాథ్, వడ్లకొండ ప్రవళిక, మమత, ప్రజలు పాల్గొన్నారు.

అనూషకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగం పరిశోధకురాలు బైరి అనూషకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆ విభాగం రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ క్రిస్టోఫర్ రూబెన్ పర్యవేక్షణలో టిష్యూకల్చర్ ఫైటో కెమికల్ అనాలసిస్ అండ్ ఫార్మాకాలజికల్ స్టడీస్ ఇన్ అర్థెమిసియా నిలాగిరిక (క్లార్కెట్) పంపు అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి బైరి అనూషకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు.

హజ్ యాత్రికులకు శిక్షణ



న్యూశాయంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లా హజ్ యాత్రికులకు ఆదివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యాన వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సొసైటీ జిల్లా అధ్యక్షుడు సర్వర్ మొహియొద్దీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు నజీమొద్దీన్ గిలానీ, అఫ్జల్ మొహియొద్దీన్, మాజీద్, ఇబ్రహీం, అజీజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉచితంగా బ్రిడ్జ్ కోర్సు

హన్మకొండ: మోహన్ కళాశాల ఆధ్వర్యంలో బ్రిడ్జి కోర్సును ప్రారంభించినట్లు ఆ విద్యాసంస్థ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఎస్ఎస్‌సీ, సీబీఎస్ఈ 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఈనెల 21వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఉచితంగా బ్రిడ్జి కోర్సు అందించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఐటీ, మెడికల్ కోర్సులకు సంబంధించిన ఫౌండేషన్, బేసిక్స్, కెరియర్ గైడెన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. రాజస్థాన్ కోటా అధ్యాపక బృందంతో బోధించనున్నట్లు తెలిపారు. వివరాలకు 97030 00850 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బీఆర్ఎస్ పాటల సీడీ ఆవిష్కరణ



హన్మకొండ: బీఆర్ఎస్ రజతోత్సవ సభ పాటల సీడీని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. కాకతీయ యూనివర్సిటీ ఉద్యమ నాయకుడు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ ఆధ్వర్యంలో రూపొందించిన పాటల సీడీని హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పాట అద్భుతంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, కేసీఆర్ మరోసారి సీఎం కావాలని ప్రతీ తెలంగాణ బిడ్డ ఆశగా చూస్తున్న భావనను ప్రతిబింబించిందన్నారు. ఈ పాటలకు సహకారం అందించిన బీఆర్ఎస్ నాయకుడు జోరిక రమేష్, సాహిత్యాన్ని సమకూర్చిన ఫీనిక్స్, గాయని జేరిపోతుల సంధ్య సత్యంను కేటీఆర్ అభినందించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, పోలపల్లి రామ్మూర్తి, గండ్రకోట రాకేష్ యాదవ్, బొల్లెపల్లి కమల్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి ప్రమాదకరం

- వరంగల్ – ఖమ్మం హైవేలో తరచూ రోడ్డు ప్రమాదాలు
- పదిరోజుల్లో ఇద్దరు దుర్మరణం
- భయాందోళనలో ప్రయాణికులు



వీధి లైట్లు లేని వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారి

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిలో అంధకారం నెలకొంది. పదేళ్ల క్రితమే గ్రామాలన్నీ నగరంలో విలీనమయ్యాయి. అయితే నగరానికి తగట్టుగా ఇంకా అభివృద్ధి చెందలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి ఐనవోలు కమాన్ వరకు నగరంలో పరిధిలో ఉన్నా.. ప్రధాన జాతీయ రహదారిపై సెంటర్ లైట్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల అంధకారంగా నెలకొంటోంది. అలాగే, ఆర్టీఏ జంక్షన్ నుంచి ఉర్సు గుట్ట మీదుగా మెడికేర్ ఆస్పత్రి పై ఓవర్ బ్రిడ్జి వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లే కానీ వెలగడం లేదు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారిపై అంధకారంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలగా సెంట్రల్ లైట్ల ఏర్పాటు

వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి ఐనవోలు కమాన్ వరకు విద్యుత్ దీపాలు (వీధి లైట్లు) ఏర్పాటు చేయాలని పలుమార్లు గ్రీవెన్ సెల్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. వివిధ పనులపై నగరానికి వెళ్లిన ప్రజలు తిరిగి ఇంటికి చేరుకోలేని పరిస్థితులు దాపురించాయని వాపోతున్నారు. చీకటిలో రోడ్డు స్పష్టంగా కనిపించక.. ఎదురు వచ్చే వాహనాల లైట్ల ఫోకస్‌తో రోడ్డు పక్కన పార్క్ చేసిన లారీలు, ఇతర వాహనాలను ఢీకొని పలువురు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. వారానికి కనీసం నాలుగు రోడ్డు ప్రమాదాలు, ఒకరిద్దరు ప్రాణాలు పోవటం పరిపాటిగా మారిందని విలీన గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

వెలగని వీధి దీపాలు

వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి ఉర్సు గుట్ట మీదుగా మెడికేర్ పై ఓవర్ బ్రిడ్జి వరకు సెంట్రల్ లైటింగ్ ఉన్నా అనతి కాలంలోనే మరమ్మతులకు గురై వెలగడం లేదు. దీంతో ఆరు నెలలుగా ఈ రహదారిలో చీకట్లు అలుముకున్నాయి. సుమారు మూడు కిలోమీటర్ల మేర లైట్లు వెలుగపోవడంతో భారీ వాహనాలు, రేగడి లోడ్ టిప్పర్ల వేగానికి రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

పది రోజుల్లో ఇద్దరు దుర్మరణం

ఉర్సుగుట్ట శివారు రోడ్డుపై పదిరోజుల వ్యవధిలోనే ఇద్దరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. భద్రకాళి చెరువు నుంచి బయల్దేరిన రేగడి లోడ్ టిప్పర్లు అతివేగంగా దూసుకుపోతున్నాయి. ఒక పక్క చీకటి.. మరోపక్క టిప్పర్ల వేగం వల్ల పదిరోజుల్లో ఇద్దరి దుర్మరణం చెందగా, మరికొంత మంది గాయాలపాలయ్యారని స్థానికులు చెబుతున్నారు.

సెంట్రల్ లైట్లు ఏర్పాటు చేయాలి



ఆర్టీఏ జంక్షన్ నుంచి మామునూరు మీదుగా ఐనవోలు కమాన్ వరకు సెంట్రల్ లైట్లు ఏర్పాటు చేయలేదు. ఈ రహదారిపై భారీ వాహనాలు దూకుడుగా వెళ్తున్నాయి. చీకట్లో రోడ్డు పక్కన పార్క్ చేసి వాహనాలను ఢీకొని వాహనచోదకుల ప్రాణాలు పోతున్నాయి. ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సాయంత్రం, రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే భయంగా ఉంటోంది. అధికారులు స్పందించి వెంటనే సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి.

– జగపతి యాదాల, రాంగోపాల్‌పురం, వరంగల్

ప్రమాదాలను నివారించాలి



వరంగల్ ఉర్సు గుట్ట హంటర్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. అధికారులు స్పందించి ఈరోడ్డులోని లైట్లకు మరమ్మతులు చేపట్టి రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి. అంధకారం కారణంగా పదిరోజుల వ్యవధిలో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిశాయి. ఇప్పటికైనా వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలి.

– కొల్లూరు యోగానంద్, రంగశాయిపేట, వరంగల్

అంబేడ్కర్‌ను అవమానించారు

- ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్



ర్యాలీలో పాల్గొన్న అతిథులు, తదితరులు

హసన్‌పర్తి: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్‌షా అవమానించారని ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ విశ్వనాథన్ పెరుమళ్ అన్నారు. 66వ డివిజన్ హసన్‌పర్తిలో ఆదివారం నిర్వహించిన జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వనాథన్ మాట్లాడుతూ జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ నినాదానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పాదయాత్రలు చేయాలన్నారు. అంబేడ్కర్‌ను అవమానిస్తూ, రాజ్యాంగాన్ని ఏవిధంగా కించపరిచేలా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు వ్యవహరిస్తున్నాయో ప్రజలకు వివరించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ ఆమోదం సామాజిక విప్లవంగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతీ పౌరుడి బాధ్యత అని గుర్తుచేశారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కనపర్తికి కిరణ్, దేవస్థాన కమిటీ చైర్మన్ వెంకటస్వామి, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, దేవస్థాన ధర్మకర్త కొండమీది సంతోష్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

న్యూశాయంపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ కార్పొరేట్ అనుకూల విధానాలపై పోరాటాలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని తీర్మానం చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ అధ్యక్షతన జాతీయ కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తోందని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 27న జిల్లా సదస్సును హనుమకొండలో నిర్వహించనున్నట్లు రాగుల రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కుల రాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు నున్నా అప్పారావు, ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్‌రావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్, ఐఎన్‌టీయూసీ నాయకులు మైముదా పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



సమావేశంలో మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

మడికొండ: మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. కాజీపేట మండలం మడికొండలో గ్రామశాఖ మహాసభను కోరపెల్లి జ్యోతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ మడికొండ శివారులోని డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో మడికొండ, రాంపూర్, ఎలుకుర్తి, టేకులగూడెం, బాపూజీనగర్, ధర్మసాగర్ తదితర గ్రామాల ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, రాసమల్ల దీన, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, నేదునూరి వెంకటరాజం, కోరపెల్లి రమ, మాధవి, లావణ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హసన్‌పర్తి: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



ఒకే వేదికపై వాగ్దేవి పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విద్యాలయంలో 1999 – 2000 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు ఒకచోట చేరి గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. ప్రతిఏటా ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు. కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం, తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు వెంకటేశ్వర్లు, కిషన్‌రెడ్డి, అరుణ, సంతోష్, నరేందర్, వేణుగోపాల్, సుధాకర్‌ను సన్మానించారు. సమ్మేళనంలో కార్యక్రమ నిర్వాహకులు కేదాసి రాకేష్, శివశంకర్, బాలకృష్ణ, కిశోర్ పాల్గొన్నారు.

వాగ్దేవి పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నయీంనగర్: నగరంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల (1996 – 99) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు ఒకచోట చేరి అప్పటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనంతరం, తమకు పాఠాలు బోధించిన అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల వ్యవస్థాపకుడు దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్ వాహిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముస్లింలకు మెరుగైన సేవల కోసమే వక్ఫ్ చట్టం సవరణ

కాజీపేట: అణగారిన ముస్లింలకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నిస్తుంటే కొన్ని శక్తులు రాజకీయ స్వార్థంతో వ్యతిరేకించడం బాధాకరమని బీజేపీ హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ.చాంద్‌పాషా ఆవేదన వ్యక్తం చేశారు. కాజీపేట మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బీజేపీ ముస్లిం మైనార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ చట్టం.. అడ్డంకులన్నింటిని అధిగమించి ముస్లింలకు తగు న్యాయం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ముస్లింల కోసం ఎప్పుడూ ఆలోచించని కొన్ని పార్టీలు.. ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ చట్ట సవరణను వ్యతిరేకిస్తున్న విషయాన్ని గుర్తించాలని కోరారు. సమావేశంలో అఫ్జల్, యాకుబ్, సర్దార్ పాషా తదితరులు పాల్గొన్నారు.

బియ్యం తూకం వేసి ఇవ్వాలి



హన్మకొండ చౌరస్తా: వే‌బ్రిడ్జి ద్వారా బియ్యం తూకం వేసి దుకాణాలకు సరఫరా చేసేలా జిల్లా జాయింట్ కలెక్టర్లు, కమిషనర్లు, పౌర సరఫరాల మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఈమేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు ఆధ్వర్యంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్న ప్రతీ బియ్యం బస్తాలో 1 నుంచి 3 కిలోల వరకు బియ్యం తక్కువగా వస్తోందని తెలిపారు. తద్వారా రేషన్ డీలర్లు నష్టపోతున్నారని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్, పోతరాజు రమేష్, తోట సమ్మయ్య, చందుపట్ల రాజేందర్‌రెడ్డి, గడ్డం సర్వేశం, రాజసాంబయ్య, బత్తుల మహేష్, విజయ్‌పాల్, కూరపాటి శ్రీనివాస్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చార్లీచాప్లిన్ జయంతి



హన్మకొండ చౌరస్తా: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హాస్యనటుడు చార్లీ చాప్లిన్ జయంతి వేడుకలు హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం జరిగాయి. రోజా ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ హాజరై మాట్లాడారు. అంతులేని కష్టాలు, పేదరికంలో ఉన్నప్పటికీ ప్రపంచానికి నవ్వులు పంచిన ఘనత చార్లీచాప్లిన్‌దేనని గుర్తుచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కేంద్రం తెచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

కాజీపేట: కేంద్ర ప్రభుత్వం పీఎం నరేంద్ర మోదీ నాయకత్వంలో ముస్లిం మైనార్టీలను టార్గెట్ చేస్తూ తీసుకొచ్చిన నల్ల చట్టాన్ని రద్దు చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. లేకుంటే సెక్యులర్ భావాలు కలిగిన ప్రజలను కలుపుకుని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా కాజీపేట మండలం దర్గా కాజీపేటలో మిల్లత్ రాబ్తా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఫ్జల్ బియాబాని దర్గా పీఠాధిపతి, మిల్లత్ రాబ్తా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గులాం అఫ్జల్ బియాబాని (ఖుస్రూపాషా) మాట్లాడుతూ ముస్లింలకు నష్టం కలిగించే ఆలోచనలకు కేంద్ర ప్రభుత్వం వెంటనే స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ విశ్వనాథన్, అబుబక్కర్, సయ్యద్ రజాలీ, మీర్జా అజీజ్, అయుబ్, కదూస్ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం ఎవరికీ వ్యతిరేకం కాదు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న అమరేందర్ రెడ్డి

- బీజేపీ నేత, న్యాయవాది అమరేందర్ రెడ్డి

హన్మకొండ: అసదుద్దీన్ ఓవైసీ, కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు వక్ఫ్ సవరణ చట్టం ఏ వర్గానికీ వ్యతిరేకం కాదని బీజేపీ రాష్ట్ర నాయకుడు, న్యాయవాది రావు అమరేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన వక్ఫ్ సుధార్ జనజాగరణ అభియాన్ వర్క్‌షాపు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టం.. పేద ముస్లింలకు ఉపయోగపడేదేనని అన్నారు. వక్ఫ్ చట్టాన్ని సవరించి పేద ముస్లింలకు మేలు చేసేలా చర్యలు తీసుకుంటామని గతంలో బీజేపీ ఇచ్చిన హామీ మేరకు ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రజలను మభ్యపెట్టి 2013లో వక్ఫ్ చట్టంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం మార్పులు చేసిందని విమర్శించారు. వర్క్‌షాప్‌లో నేతలు డాక్టర్ పగడాల కాళీప్రసాద్, డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, వక్ఫ్ సుధార్ జనజాగరణ అభియాన్ జిల్లా కన్వీనర్ ఆర్ పి.జయంత్ లాల్, అభియాన్ సభ్యులు, మహిళా మోర్చా అధ్యక్షురాలు రత్నలక్ష్మి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

- జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని వడ్డేపల్లి, ఎన్జీవోస్ కాలనీల్లో ఆయన ఆదివారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ ఒక్కడే బయలుదేరాడన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితిని 2001లో స్థాపించి, అన్ని వర్గాలను ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేశారని గుర్తుచేశారు. ఆ తర్వాత టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా మారిందన్నారు. ఈ పార్టీ స్థాపించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈనెల 27న రజతోత్సవ సభను భారీఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు, మాజీ కార్పొరేటర్లు దాస్యం విజయ్‌భాస్కర్, మిడిదొడ్డి స్వప్న, కేశబోయిన అరుణ్‌శ్రవణ్, నాయకులు కందేరావు నర్సింహారావు, మధు, చంద్రమౌళి గౌడ్, జైపాల్, సుదర్శన్, ప్రసంగి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై గత ప్రభుత్వానిది నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు

ఖిలా వరంగల్: వరంగల్ అభివృద్ధిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో దండు లక్ష్మణ్ అధ్యక్షతన పార్టీ జిల్లా సమితి సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం, తీవ్ర వివక్ష ప్రదర్శించిందన్నారు. నగరాభివృద్ధికి కార్పొరేషన్ ఏటా రూ.300 కోట్లు కేటాయిస్తామని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తామని, పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తామని చెప్పి చేయలేదన్నారు. గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వలేదని, అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ చేయలేదని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి, పంజాల రమేష్, ఎస్.కె.బాషుమియా, పనాస ప్రసాద్, తోట చంద్రకళ, బుస్సా రవి, గన్నారపు రమేష్, ఎలేందర్, భద్రి, రమేష్, మునీశ్వరుడు, చెన్న కేశవులు, వీరగొని శంకరయ్య పాల్గొన్నారు.

అన్ని వర్గాల సమస్యలపై ఉద్యమిస్తాం



సభలో అభివాదం చేస్తున్న టీపీఎఫ్ నాయకులు

నయీంనగర్: తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆవిర్భావం నుంచి ప్రజాస్వామిక తెలంగాణ నినాదాన్ని ముందుకు తీసుకువచ్చిందని, ఇక ముందు అన్ని వర్గాల సమస్యలపై ఉద్యమిస్తామని టీపీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో టీపీఎఫ్ 4వ జిల్లా మహాసభలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాధనలో వందలాది మంది విద్యార్థులు తమ ప్రాణాలు త్యాగం చేశారని గుర్తుచేశారు. భారత్ బచావో బాధ్యుడు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ తెలంగాణలో ప్రజాస్వామిక హక్కుల కోసం టీపీఎఫ్ ఉద్యమించిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు ఒక బోగస్ అని, ప్రజాస్వామిక, సామాజిక తెలంగాణ నినాదాన్ని పక్కకు నెట్టివేయాలనే కుట్ర జరిగిందన్నారు. టీపీఎఫ్ కన్వీనర్ రమాదేవి మాట్లాడుతూ భారత్‌లో ఉచిత విద్య, వైద్యం అమలు చేయాలని సూచించారు. మనుధర్మాన్ని పారద్రోలి, ఆదివాసీల ప్రాణాలను కాపాడాలని భారతీయులు కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అనిశెట్టి రజిత, జిలుకర శ్రీనివాస్, ప్రొఫెసర్ కాశీం, ప్రవీణ్ కుమార్, ఇంద్రసేన, పాపయ్య, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల అధ్యాపకురాలికి సన్మానం



భద్రకాళి సోమయాజుల దంపతులను సన్మానిస్తున్న ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, తదితరులు

విద్యారణ్యపురి: ఉద్యోగ విరమణ పొందిన హనుమకొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల (వెస్ట్) మహిళా డిగ్రీ కళాశాలలో బాటనీ అధ్యాపకురాలు భద్రకాళిని ఆయా సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, అధికారులు సన్మానించారు. హనుమకొండలోని ఓ బాంక్వెట్ హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గురుకులాల భద్రాద్రి కొత్తగూడెం జోనల్ ఆఫీసర్ స్వరూప రాణి, నల్గొండ జోనల్ ఆఫీసర్ విద్యారాణి, ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, రిటైర్డ్ లెక్చరర్లు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కొనసాగుతున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె

కేయూ క్యాంపస్: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కేయూ పరిపాలన భవనం ఎదుట చేపట్టిన సమ్మెకు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ బాధ్యులు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, డాక్టర్ సాదు రాజేష్, డాక్టర్ మాదాసి కనకయ్య ఆదివారం సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. 20ఏళ్లకు పైగా ఒప్పంద అధ్యాపకులుగా పనిచేస్తున్నప్పటికీ ఇప్పటికీ రెగ్యులరైజ్ చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని 12 రోజులుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోయారు. సమ్మెలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ బాధ్యులు సూర్యం, బైరి నిరంజన్, జూల సత్య, సూర్యనారాయణ, చంద్రశేఖర్, రఘువర్ధన్, సునీత, సంగీత్‌కుమార్, భాగ్య, సుకన్య, ఉషాకిరణ్, శ్రీలత, సత్యనారాయణ, సిద్ధార్థ్‌తదితరులు పాల్గొన్నారు.

నిరంతర కృషి, పట్టుదలతో విజయం

కేయూ క్యాంపస్: నిరంతర కృషి, పట్టుదలతో విజయం తథ్యమని కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ అన్నారు. హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల స్పోర్ట్స్, కల్చరల్ డే వేడుకలు శనివారం రాత్రి జరిగాయి. కార్యక్రమంలో కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య, కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, యూనివర్సిటీ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అమరవేణి, పాలక మండలి సభ్యురాలు రమ పాల్గొన్నారు.

రూ.25వేల గంజాయి స్వాధీనం

వరంగల్: నగరంలోని జెమిని సెంటర్‌లో ఆదివారం ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.25 వేల విలువైన 500గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. నిందితులు కమలాపూర్ మండలం అంబాల గ్రామానికి చెందిన జేరిపోతుల జస్వంత్, కుమ్మరి శ్రీమాన్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.